# బడ్డీకొట్టూ బతుకుతెరువూ

ముగ్గురు కొడుకులూ, ఇద్దరు కూతుళ్లూ పురిటిలోనే చచ్చిపోయి, ఇక సంతానం నిలువదనుకుని ఆందోళన పడ్డారు. ఆ తరువాత పుట్టిన మగ పిల్లవాడు నెలలవాడయినా భయం పోలేదు. ఏడాది నిండాక ధైర్యం వచ్చింది. వాడికి వెఱ్ఱిబాబు అని పేరు పెట్టారు. అంతా ముద్దుగా వెఱ్రోడా అని పిలిచేవారు. వాడు రెండేళ్ళ వాడయ్యేసరికి మరొక కూతురు పుట్టి బ్రతికింది. వెఱ్రివాడికి పదేళ్ళు నిండేసరికి తండ్రి చచ్చిపోయాడు. విజయనగరం మహారాజా కాలేజీలో చదువుకుంటుండగా వాడికి మొదటిసారి తనపేరు బాగులేదని తెలిసింది. ఇంగ్లీషు స్పెల్లింగులో స్వల్పమైన మార్పుచేసి తనపేరు సులభంగానే ఎర్రబాబు అని మార్చుకున్నాడు. అని మార్చుకున్నాడు. అందరికి తన పేరు ఎర్రయ్య అనే చెప్పేవాడు. ఆ పేరు కొంతమేరకు వాడికి నచ్చింది.

ఎర్రయ్య కంపార్టుమెంటు పద్దతిలో బి.ఏ. పూర్తి చేశాడు. ఉద్యోగాల పేరులో అలసిపోయాడు. ఇదంతా జరిగే సరికి దేశంలో ఎమర్జెన్సీ వచ్చింది. వెళ్ళింది, అతని మిత్రుల్లో ఒకడు సైకిలు షాపు పెట్టుకున్నాడు. మరొకడు టైలరింగు షాపు, ఇంకోడు కిళ్లీబడ్డీ, మరొకడు బైండింగు షాపు పెట్టుకున్నారు. ఒకరిద్దరికి చిన్న చిన్న గుమాస్తా ఉద్యోగాలొచ్చియి. పలుకుబడిగల మరొకరిద్దరు నుంచి ఉద్యోగాల్లో వున్నారు.

ఎర్రయ్య బి.ఏ. పూర్తిచేసి చివరికి బడ్డీ కొట్టు పెట్టడానికి నిర్ణయించుకున్నాడు విశాఖపట్నం వెళ్లేదారిలో మధురవాడ దగ్గర కొత్తకాలనీ లేస్తుందనీ ఒక మిత్రుడు సలహాయిచ్చాడు.

విశాఖపట్నం వెయ్యికాళ్ళ జెర్రిలాగ విస్తరిస్తోంది. ప్రజలు కొండలు కొరికేసి కాలనీలు చేసేస్తున్నారు. సముద్రాన్ని తరిమేసి ఎపార్టుమెంట్లు కట్టేస్తున్నారు. ఆ క్రమంలోనే మధురవాడ దగ్గర సుమారు పాతికెకరాల స్థలంలో ఒకచిన్నకాలనీ తయారవుతోంది. కృష్ణాజిల్లాకి చెంది ఒక చౌదరి పదేళ్ళ క్రితం ఆ స్థలం పరమచౌకగా కొనేశాడు. ఇప్పుడా స్థలం బంగారుగుడ్లు పెడుతోంది. ప్లాట్లుచేసి అమ్ముతున్నాడు. తునిమంచి ఒకరాజుగా రొచ్చి పదిసెంట్ల స్థలం కొన్నాడు. కాలనీ మొగలోనే వుందా స్థలం. ఎలా పట్టాడో రాజుగార్ని పట్టాడు ఎర్రయ్య. ఆ స్థలాన్నానుకుని బడ్డీ పెట్టాడు. ఆ రాజుగారికి రాజమండ్రిలో మేడలున్నాయి. సామర్ల కోటలో స్థలాలున్నాయి. పెద్దాపురంలో పెద్ద పిండిమిల్లుంది. మధురవాడ స్థలంమీద పెద్దదృష్టి లేదు. ముందు ముందు ఆ స్థలానికి రేటొస్తుందని కొన్నాడు. పోనీలే స్థలం కనిపెట్టుకుని వుంటాడని ఎర్రయ్యని బడ్డీకొట్టు పెట్టుకోమన్నాడు. స్థలం చుట్టూకంచె పెట్టించేడు.

ఎర్రయ్య కొద్దిపాటి ఖర్చులో చెక్కల్తో బడ్డీ బిగించాడు. కాలనీలో ఇళ్ళు తయారవుతున్నాయి. సిమెంటు లారీలూ, ఇటుక బళ్లూ, ఇసక బళ్లూ, సామాన్లతో ట్రాక్టర్లూ వస్తున్నాయి. మే స్త్రీలు కూలీలూ వస్తున్నారు. వాళ్ళకి చుట్టాబీడీ కావాలి. చన్నీళ్ళు కావాలి. అనే పెట్టాడు ఎర్రయ్య అప్పుడప్పుడు వచ్చే

చిన్నా, పెద్ద ఉద్యోగులకోసం కింగ్‌సైజ్ సిగరెట్లు కూడా పెట్టాడు. అగ్గి పెట్టెలు, వక్కపొడి పొట్లాలు సరేసరి. ఎర్రయ్యకి రెండేళ్ళ వరకూ ఏమీమిగల్లేదు. ఎలాగో ఈడుచుకొస్తున్నాడు. కొద్దిపాటి చదువుకున్నవాళ్లు ట్యూషన్లు చెప్పుకుని బతుకుతున్నారని తెలుసు. బీ.ఏ. పాసయిన తనుకూడా ఈకొట్టు ఎత్తేసి ఆ పని చేద్దామనుకున్నాడు. కానీ తలకేం వచ్చును ? పుస్తకం ముట్టుకుని చాలా కాలమయింది. తన వల్లకాదు. కాలనీలో పదిపన్నెండు కుటుంబాలవారు దిగారు. చాక్‌లెట్లూ, అరటిపళ్ళూ...... ఇలా మరికొన్ని సరుకులు పెంచాడు.

కొత్తగా విజయనగరం జిల్లా ఏర్పడి సుమారు రెండేళ్ళయింది. రైల్వేస్టేషను పరిసరాల్లో కొన్ని ఆఫీసులొస్తాయి. ఆ పరిసరాల్లో కొట్టు పెట్టుకుంటే మంచిదని కొందరు చెప్పారు. అది ఒకప్పటి స్వంత ఊరే కావచ్చుగాని, వదులుకుని వచ్చేశాక మళ్లీ అక్కడ నిలదొక్కుకోవడం కష్టంగా కనబడింది. ఆ సమయంలో మాధవరావు కనపడి తానొక ఉద్యోగం కోసం తిరుగుతున్నానని నువ్వూ ప్రయత్నం చేస్తావా? -అనీ అడిగాడు. అతగాడు మా క్లాస్‌మేట్. మంచి మార్కుల్తో పాసయ్యాడు. కొన్నాళ్ళు ఎం.ఏ. చేసి ఎందుకనో సగంలో వదిలేసి వచ్చేశాడట. నేనా ప్రయత్నాలేవీ చెయ్యలేను, ఈ బడ్డీకొట్టు చాల్లే అన్నాడు -ఎర్రయ్య.

ఇంతలో ఆ కాలనీలోకి సిటీబస్సు పడింది. అది కొత్తబస్సేంకాదు. ఇన్నాళ్లూ తారురోడ్డుమీద నించి వెనక్కి వెళ్లేది. కాలనీలో ఇళ్ళు కట్టుకున్న కొందరు పెద్దవాళ్ళ ప్రయత్నం వల్ల, సుమారు ఒక కిలోమీటరు లోపలికి వస్తున్నది. అది ఎర్రయ్య బడ్డీదాటి మీదకి వెళ్లి, అక్కడ వెనక్కి తిరిగి మళ్లీ బడ్డీ దగ్గర కొచ్చి ఆగుతుంది. సబ్బులూ టూత్ పేస్టులూ, బ్లేళ్లూ, పౌడరు డబ్బాలూ, దువ్వెనలూ పెట్టాడు. జేబురుమాళ్ళూ, న్యూస్‌పేపర్లూ, సినీమా పత్రికలూ కూడా పెట్టాడు.

ఎర్రయ్య జాగ్రత్తయిన వాడే, ఏదీ ఎంతవరకూ అమ్ముతుందో అంతవరకే పెడతారు. షాపు పుంజుకున్నాక - కొంతకాలంగా టీ చెయ్యడం మానేశాడు. ఎదురుగా చిన్న టీకొట్టు లేచింది. వాడు బిస్కెట్లు బన్‌రొట్టెలు కూడా దించాడు. పోనీ బతకనీ అనుకున్నాడు ఎర్రయ్య. ఎవళ బేరం వాళ్లది.

ఎర్రయ్యబడ్డీకి ఎదురుగా ఒక పంతులు బ్రతుకు తెరువు కోసం ఆంజనేయుడి పటం పెట్టాడు. ఆ పటం ఏడాది తిరిగేసరికి ఒక చిన్న విగ్రహంగా మారింది. మరో ఏడాది తిరిగేసరికి విగ్రహం దగ్గర హుండీ, చుట్టూ మండపం ఏర్పడ్డాయి. ఆ పంతులు పని బాగానే వుంది. ప్రతి మంగళవారం సాయంత్రం ప్రత్యేకంగా భక్తులు వస్తారు. ప్రతి మంగళవారం ఒకతను వచ్చి కొబ్బరికాయలు, ఊదొత్తులు, కర్పూరం మొదలైనవి అమ్ముతాడు. ఆ భక్తులకు కావలసినవి ఎర్రయ్యబడ్డీమీద దాదాపు ఏమీ వుండవు.

ఎర్రయ్య బడ్డీమీద న్యూస్ పేపర్లు, వీక్లీలు పెట్టేనాటికి పంతులు సంపాదన బాగా పెరిగింది. ఎవర్నో పట్టుకుని, కాలనీని ఆనుకుని లేస్తున్న మరొక కాలనీలో మూడు సెంట్ల ముక్క సంపాదించాడు. ఆంజనేయస్వామి విగ్రహం పెట్టిన సెంటున్నరజాగా ఇప్పటికి పంతులుదే. అది నిజానికి రోడ్డువార ఆక్రమించిన స్థలం. పట్టాలేదూ పాడూ లేదు. దేవుడిపటం పెట్టినవాడిని పట్టాకోసం ఎవడు అడుగుతాడూ?.

ఎర్రయ్యకి పంతులును చూస్తే చాలా కష్టం వేసింది. ఒక పటం, ఒక పళ్లెం తప్ప పైస

పెట్టుబడి లేదు. నోటికొచ్చిన శ్లోకాలు, మంత్రాలు తప్ప మరే విద్య లేదు. మూడేళ్ల తిరిగేసరికి పటం - విగ్రహమైంది. కాలనీలో స్థలం కొన్నాడు. మరి తను ? అప్పుడు కొంచెం అప్పుడు కొంచెం కావచ్చు. బోలెడు పెట్టుబడి పెట్టాడు. చాలా కష్ట పడ్డాడు. ఏ సరుకు మిగిలిపోతుందోననే ఆందోళనే ఏరోజూనూ, దేవుడు ఎంతటి వ్యాపార వస్తునో కళ్లారా చూశాడు. దేవుడి పేర ఎంతస్థలం ఆక్రమించినా అస్సలు అడిగేవాడు లేడు. కాకపోతే భక్తిని చాలా జాగ్రత్తగా వాడు కోవాలి. చేతకాకపోతే బెడిసి కొట్టనూవచ్చు. పంతులు భక్తుడు మాత్రమేకాడు, పరమలౌక్యుడు బతకనేర్చినవాడూను.

ఎర్రయ్య బడ్డీకొట్టు సంపాదనమీదే తల్లినీ చెల్లినీ పోషించాడు. చెల్లికి పెళ్లిచేశాడు. పెద్ద కట్నం ఏమీ ఇవ్వకపోవచ్చుగాని, బాగానే చేశారు. బావమరిదికి రణస్థలంలో నాలుగెకరాల పొలం వుంది. ఆలకించిన వాళ్లంతా చాలా చవకగా చెల్లికి పెళ్ళి చేశేవన్నారు. ఎర్రయ్యకి ఏం ఆస్తివుంది ! బడ్డీని ఆనుకుని ఉన్న కమ్మరేకుల పాకే ఎర్రయ్య నివాసం. ఇంతలో ఎర్రయ్య తల్లి చచ్చిపోయింది. ఎర్రయ్యకి ఇంత అన్నం వండి పెట్టి, బడ్డీనీ, ఇంటినీ కనిపెట్టుకుని వుండే దిక్కులేదు. ఎర్రయ్య - ఎదురుగా వున్న పంతుల్ని ఆశ్రయించాడు. పంతులు ఆర్నెల్లలో భోగాపురంనుంచి ఒక సంబంధం తెచ్చాడు. పిల్లపేరు వసంత (ఇంట్లో అంతా వలసా, వలసా అని పిలుస్తుంటే మొదట్లో అర్థం కాలేదు. ఆ పిల్ల అసలు పేరు వలసమ్మ!) ఆంజనేయస్వామి గుడిలోనే పెళ్లి జరిగింది. విగ్రహం చుట్టూ ఈ మధ్య మంటపం గుడీ వెలిశాయి. ఆ మండపంలోనే వసంత ఎర్రయ్యల పెళ్లి జరిగింది. ఆ మండపానికి అదే మొదటి పెళ్లి.

వసంత వచ్చాక ఎర్రయ్యకి కాస్త చెయ్యిసాయం దొరికినట్టయింది. భోజనం చేసి కాస్తకునుకు తీస్తున్నాడు. రెండ్రోజుల కొకసారైనా సిటీబస్సెక్కి టౌన్లోకి వెళ్తున్నాడు. ఇన్నాళ్లూ యిది కుదిరేదికాదు. తల్లిగానీ, చెల్లిగానీ కొట్టుమీద కూచునేవారుకాదు. కొట్టుకు తాళం వేసి వెళ్లవలసి వచ్చేది. ఇప్పుడు వసంత కొట్టుమీద కూచుంటుంది.

'ఒసంత' అనబడే వలసమ్మ భోగాపురంలో ఏడోక్లాసు పాసయింది. తండ్రిది పాలవర్తకం. నాలుగు పాడి గేదెలున్నాయి. పెళ్లికాక ముందు ఆ పాలవర్తం లెక్కలన్నీ వలసమ్మే - అదే ఒసంత చూసేది. వలసంతది కళ్లు చెదరగొట్టే అందం కాదుగాని మరీ అంత కొట్టిపారెయ్యడానికి లేదు. కొట్టుమీద కూచుంటే బేరం బాగానే వస్తుంది. మొదట్లో ఎర్రయ్యకి చాలా కోపంగా బాధగా వుండేది. కాని చాలా త్వరలోనే తెలుసుకున్నాడు. వసంత నిప్పులాంటిదని. ఒసంతా అనిపిలిస్తే నవ్వుతూ పలుకుతుందని ఆప్యాయంగా మాట్లాడుతుందని ఒసంతంటే ఎర్రయ్యకి వల్లమాలిన ఇష్టం.

తునిరాజు తనజాగా అమ్మేశాడు. బాగా రేటొచ్చింది. ఆ కొనుక్కున్నవాడు పాకతీసెయ్యమని కూచున్నాడు. బడ్డీ పంచాయితీ జాగా, లేకపోతే అదీ తీసెయ్యమనేవాడే - నాలుగిళ్ళ అవతల అద్దెకు ఇల్లు తీసుకోక తప్పలేదు. ఎర్రయ్యకి ఇది చాలా కష్టం కలిగించింది. నిజానికది ఇల్లుకాదు. ఇల్లు ముక్క. దాని పక్కరెండు సెంట్ల స్థలం ఖాళీ. ఆ ఇల్లు ముక్క, పక్కనున్న స్థలం కొనడానికి చాలా పాట్లు పడవలసి వచ్చింది. ఒసంత తన బంగారం తీసి ఇచ్చేసింది. మొత్తానికి ఉండటానికింత నీడ సంపాదించు కోగలిగినందుకు ఎర్రయ్య సంతృప్తి పడ్డాడు. సుమారు పదేళ్ల క్రితం తను చింతచెట్టుకింద ఉండేవాడు.

ఇప్పుడా చెట్టూ లేదు బడ్డీ లేదు. - ఈ స్థలాలు అప్పట్లో ఎవరికీ అక్కర్లేక పోయేవి. ఇప్పుడనే ఎత్తు బంగారం చేస్తున్నాయి.

చెల్లీ బావా రణస్థలంనుంచి యాత్రలకి బయల్దేరారు. ఎంతో దూరం కాదు. సింహాచలం, రాజమండ్రిలో గోదావరి స్నానం, బెజవాడ కనకదుర్గగుడి కృష్ణలో స్నానం - మళ్లీ తిన్నగా తిరిగి రావడం, వాళ్ల పట్టుదల వల్ల ఒసంత ఎర్రయ్య కూడా బయల్దేరారు. ఎర్రయ్య వైజాగ్ పోలి మేరలు ఎన్నడూ దాటిన వాడు కాడు. రాజమండ్రిలోనూ, బెజవాడలోనూ ఆ దుకాణాలు ఆ వ్యాపారం చూస్తుంటే మతిపోయింది. చెల్లిలి పెనిమిటిది రణస్థలం గనుక మాట బాగా యాస. ఆ మాటకొస్తే ఒసంత మాటా యాసేగాని, గొంతు వినసొంపుగా వున్న మూలాన్న అంత ఎబ్బెట్టుగా ఉండదు. బావని - బెజవాడలో అంతా ఏదో జంతువును చూసినట్టు చూసేవారు. అతని మాటలకి, (అలగ, ఇలగ అంటాడు, రమ్మీ, సూడిమీ అంటాడు.) మాట తీరూ, యాసా - మనిషిని అంచనా వెయ్యడానికి ఎంత ముఖ్యమైన విషయాలో ఎర్రయ్యకి మొదటిసారి తెలిసింది. తను పుట్టిపెరిగిన విజయనగరం పరిసరాల్లో అంత సారవంతభూముల్లేవుగాని రణస్థలం పరిసరాల్లో కొబ్బరి తోటలూ, జీడితోటలూ, మామిడితోటలూ బాగానేవున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో ఇంకా తూర్పుకి వెళితే గోదావరి జిల్లా భూములు చాలవు. ఉద్దానం తీరం యావత్తూ అరటి తోటలూ, కొబ్బరి తోటలూ కన్ను చెదరగొడతాయి. పలాస నుంచి సోంపేట దాటేవరకూ - ఎంత సారవంతమైన భూములు ! కానీ గోదావరి కృష్ణాజిల్లాల జీవితానికి తూర్పు జిల్లా జీవితానికి ఎంత తేడా ! బెజవాడలో బడ్డీ దుకాణాలు చూసి తన దుకాణం ఎంత తీసికట్టో అర్థమయింది ఎర్రయ్యకి ! అందుకే తూర్పు జిల్లాలన్నా, వాళ్ళ భాష అన్నా అంత చులకన గోదావరి కృష్ణా జిల్లా వాళ్లకి !

బెజవాడలో రైలెక్కి, తుని, అనకాపల్లి దాటేవరకూ - తన ప్రపంచం కాదనే తెలిసింది ఎర్రయ్యకి. అనకాపల్లి దాటి విశాఖపట్నం దగ్గరపడి మాటతీరు మారేవరకూ ఎర్రయ్య మనసు అలాగే వెలిగితిగా ఉంది.

పెళ్ళయ్యాక ఏడాదికో కూతురు చొప్పున ఇద్దరుకూతుళ్ళు పుట్టేసరికి ఎర్రయ్యకి కంగారు పుట్టింది. ఇక ఆపరేషను చేయించుకొంటానన్నాడు. తొందరపడొద్దని చెప్పి తొందరలోనే ఒక కొడుకును కన్నది. ఆ తరువాత ఆపరేషను చేయించుకున్నాడుగాని - అశ్రద్ధచేసేశాడు. చివరికి ఒక కుటుంబనియంత్రణ కార్యకర్త బాధపడలేక ఆపరేషన్ చేయించుకున్నాడు. ఏడోనాడు ఇంకా కుట్లయినా విప్పకముందే నెలతప్పానని చెప్పింది ఒసంత. ఆరకంగా ఎర్రయ్యకి ఇద్దరు కూతుళ్ళూ, ఇద్దరు కొడుకులూ.

ఇప్పుడు ఎర్రయ్య బడ్డీకొట్టుమీద దొరకని వస్తువులేదు. కూల్‌డ్రింకులు రకరకాల పత్రికలు, హెయిర్ ఆయిల్ సీసాలు, సెంట్లు, ముఖ్యమై మందుల టాబ్లెట్లు, ఎలక్ట్రికల్ బల్బులు, డ్రాయర్లు, కొన్ని రకాల ప్లాస్టిక్ సామాన్లు, నోట్సులు, తెల్లకాగితాలు, అరటిపళ్ళు.... ఒకటేమిటి ఒక చిన్న డిపార్టమెంటల్ స్టోర్సు.

ఈ స్థితికి రావడానికి ఎర్ర్యకి సుమారు పది - పదిహేనేళ్ళు పట్టింది. ఎన్ని కష్టాలు పడ్డాడు ? టీలు చేశాడు.... సోడాలు అమ్మాడు, సైకిలుకు గాలికొట్టాడు. కిళ్ళీలు కట్టాడు...... సున్నంలో వేళ్ళు ముంచినప్పుడు వేళ్ల పొక్కిపోయేవి. చాలా కష్టాలు పడ్డాడు.

కాని అక్రమమైన పనులేమీ చెయ్యలేదు. బీరు బ్రాందీలు నుంచి ఆడపిల్లల్ని సప్లయిచేయ్యడందాకా వైజాగ్‌లో అక్కడక్కడ కొన్ని బడ్డీకొట్లు ఎన్నెన్ని పన్లు చేస్తాయో ఎర్రయ్యకి తెలుసు. కొందరు బడ్డీకొట్లవాళ్లు పోలీసు ఏజంట్లని, ఇన్‌ఫార్మర్లనీ విన్నాడు. మంచివాళ్లు, చెడ్డవాళ్లూ అందర్లోను వుంటారు. జీవితమే మనుషుల్నలాగ తయారుచేస్తుంది. కాని ఎర్రయ్య ఏ రకమైన అవినీతి పనీ ఏనాడూ చెయ్యలేదు. కష్టార్జితం మీదనే బతికాడు. రూపాయి దగ్గిర పదిపైసలు మిగిల్తే తృప్తి పడ్డాడు.

ఎర్రయ్య ఇప్పుడు కొంచెం నిలదొక్కుకొని డాబా కట్టుకున్నాడు. డాబా ముందు పూర్తి పేరుతో నేముప్లేటు కనిపిస్తుంది. తూరుపు ఎర్రయ్య బీ.ఏ. ఒక వాటాలో తనుంటూ మరోవాటా అద్దెకిచ్చేశాడు. పిల్లలు ఎదిగితే వాళ్ల చదువుగురించి జాగ్రత్తగా చూడాల గనుక ఈ మధ్య ఎర్రయ్య మళ్ళీ చదవడం ప్రారంభించాడు. జీవితంలో ఎదుర్కొనే పోరాటంలో పడినలిగి నేర్చుకున్న అక్షరాలు రూపం మారిపోవడం కనిపెట్టాడు. ఈ చదువులకంటే జీవితం నిస్సందేహంగా గొప్పదని అర్థం చేసుకున్నాడు.

అద్దెకి యిల్లుకావాలని అడడగడానికి వచ్చిన మాధవరావును ఎర్రయ్య పోల్చుకున్నాడు పలకరించాడు. ఇద్దరూ విజయనగరం మహారాజా కాలేజీలో ఇంటర్మీడియేట్ నుంచి బీ.ఏ. దాకా కలిసి చదువుతున్నారు. ఎర్రయ్య పరీక్షతప్పాడు. మాధవరావు హైసెంకడ్ క్లాసులో పాసయ్యాడు. తరవాత ఎర్రయ్య కంపార్టుమెంటులో బీ.ఏ. పూర్తి చేశాడు. మాధవరావు పట్టుదలగా ఉద్యోగం కోసం ప్రయత్నించాడు. ముందు కొన్ని ప్రయివేటు ఉద్యోగాలు చేశాడు. ఒక షాపులో గుమాస్తా, మరొక కంపెనీలో టైపిస్టు...... ఇలా చేసి చేసి గవర్నమెంటులో రికార్డు అసిస్టెంటు ఉద్యోగం సంపాదించేసరికి తలప్రాణం తోకలోకి వచ్చింది. వస్తుందనుకున్న ఉద్యోగం ఇంకొకడు ఎగరేసుకుపోగా చివరకి అది దక్కింది. ఆ సమయంలో మాధవరావు, ఎర్రయ్యని నువ్వు ఉద్యోగం ప్రయత్నం చేస్తావా అనడిగాడు.

ఆ ఉద్యోగంలో సుమారు ఏడేళ్లు ఏడుస్తూ పడిగాపులు పడితే జూనియర్ అసిస్టెంటుగా ప్రమోషన్ వచ్చింది. అడ్డమైన డిపార్టుమెంటు టెస్టులూ పాసయ్యాడు. త్వరలో సీనియర్ అసిస్టెంటు ప్రమోషన్ వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నాడు. మాధవరావు నీతి కబుర్లు చెబుతూ చేతులు ముడుచుకుని కూచోలేదు. అవకాశం వచ్చినప్పుడల్లా లంచాలు పుచ్చుకున్నాడు. కానీ ఏం లాభం ? ఎన్నెన్ని బదిలీలు ! పిల్లల ఆరోగ్యంపాడు, వాళ్లచదువులు పాడు...... విజయనగరం సమీపములో కణపాక దగ్గర కొన్న ఆరుసెంట్ల భూమిలో కమ్మలిల్లు తప్ప ఇంకేమీ లేదు. ఆ స్థలం ఆ కమ్మలింటితో సహా ఇప్పటికి అలాగేవుంది. దాన్ని శ్లేబ్ ఇల్లు కట్టుకోవాలన్నకోరిక తీరడానికి ఇంకా టైం పట్టేలాగుంది.

ఈ కాలనీకి సమీపంలో ఒక కిలోమీటరు దూరంలో హైస్కూలుంది. అద్దెలు చౌక, మాధవరావు ప్రస్తుతం పనిచేసే ప్రభుత్వ కార్యాలయం కూడా పెద్ద దూరం కాదు. సిటీ బస్సులున్నాయి. అంచేత అద్దెకొంప కోసం ఇటొచ్చాడు ముగ్గురాడపిల్లలట !

మాధవరావు కథవిని ఎర్రయ్యకి జాలివేసింది. ఇల్లు ఎంతలో కావాలని అడిగాడు. అయిదువందలు లోపలే కావాలట ! ఎర్రయ్య పక్క వాటాకి ఎనిమిది వందలు అద్దె. అదే టౌన్‌లో వుంటే పన్నెండు వందలకు పైస తగ్గదు. ఈ కాలనీలో అయిదువందలకి తక్కువ అద్దెవున్న వాటాలు

వెదకవలసిందే. చిన్ననాటి స్నేహితుడు కనక ఆదరించి ఆ పూట భోజనం పెట్టి పంపించాడు. తాను ఎన్నెన్ని బాధలు పడి ఈ బడ్డీకొట్టులో నిలదొక్కుకోగలిగాడో చెప్పాడు. ఒకసారి ఉద్యోగంలో చేరాక, అది ఎంత చిన్నదైనా నీకొక భద్రత వుంది. నాకు లేదు. ఈనాటికి ఈ మాత్రం నిలబడ్డాను. నేను చాలా సార్లు ఎన్నెన్నో రిస్కులు ఎదుర్కోవలసి వచ్చింది. ఈ సంగతులన్నీ మాధవరావుకు చెప్పాడు. మాధవరావు అలాంటి రిస్కులు ఎదుర్కోలేదు.

మాధవరావుకి ఎర్రయ్య ఇల్లు చూసి ఆశ్చర్యం వేసింది. నున్నటి గచ్చు, నూతిపక్క నీటికోసం మోటారు, ఎటాచ్‌డ్ బాత్ రూమ్, టౌన్‌కి ఇంతదగ్గర్లో తను ఇటువంటి ఇల్లు కట్టుకోగలగడం కల్ల ! గవర్నమెంటు ఉద్యోగాల్లో బాగా సంపాదించుకున్నవాళ్లు లేకపోలేదు. కాని మాధవరావు పరిస్థితి వేరు. ఎర్రయ్యకూడా సంపదనే లక్ష్యంగా పెట్టుకునిఉంటే ఇంకా చాలా సంపాదించుకోగలిగి వుండును. కష్టపడితే - మహాకష్టపడితే - లోటులేకుండా బ్రతకవచ్చుగాని లక్షలు గడించడం కష్టం. మోసం చేస్తే లక్షలుకాదు - కోట్లు గడించవచ్చు. ఎర్రయ్య ఎన్నడూ ఎవర్నీ మోసం చెయ్యలేదు.

ఎర్రయ్యకి సుందర్రావు కథ తెలుసు. బీచ్‌రోడ్‌లో ఎటువంటి ఎపార్ట్‌మెంట్లు కట్టేడు ! ఇవ్వాళ అతని ఆస్తి పదికోట్లయినా వుండి వుంటుంది. చాలా పెద్దకాంట్రాక్టరు. కలక్టర్లూ - ఎం.ఎల్.ఏ.లు - మంత్రులూ - వీళ్ళూ అతని పరిచయస్తులు. అతనికి పార్టీ భేదాల్లేవు. కాని చెయ్యని పని (కొందరు నీచమైన పని అంటారు) లేదు. ఎర్రయ్యని - సుందరరావు ఇవాళ కనిపించినా పలకరించాడు. కాని ఒకనాడు తెగిపోయిన చెప్పుల్తో తన బడ్డీదగ్గర నిలబడి టీతాగి వెళ్ళడం ఎర్రయ్య మరిచిపోలేదు. ఎర్రయ్య చెడిపోయిందేమీలేదు. మరి మాధవరావు ? అతని చదువు అతడ్ని ఎక్కడికి తీసుకెళ్లింది ? సుందర్రావు ఎక్కడున్నాడు ?

ఎర్రయ్య లేనపుడు - అతని బడ్డీ దగ్గరికి వెళ్లాడు, మాధవరావు, కొట్టుమీద వసంత వుంది. అద్దె ఇంటికోసం అడగబోయి ఊరుకున్నాడు. "ఏమన్నా చెప్పమంటారా" అనడిగింది వసంత. ఏం చెప్పమంటాడు ? ఏం వుంది చెప్పడానికి ? కాలిజోళ్లు అరగదీసుకుంటూ రోడ్డుదారి పట్టి మలుపు తిరిగాడు. జేబురుమాలుతో మొహాన పట్టిన చెమట తుడుచుకున్నాడు. ఎర్రయ్య బడ్డీకొట్టు ఇక్కడికి కనిపించడం లేదు. ఆ బడ్డీపక్కనున్న వేపచెట్టు మాత్రం ఆ చుట్టూవున్న చెట్లన్నిటికంటే చెట్లన్నిటికంటే ఎత్తుగా తలెత్తుకుని కనిపించింది.

*రచన : ఆగస్టు / సెప్టెంబరు 1995*

*ప్రచురణ : మందాకిని, మాసపత్రిక ఫిబ్రవరి 1996*